Digital, tmedia.net.in

టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

www.tmedia.net.in

సంపుటి : 8
సంచిక : 267
పేజీలు : 3
ఆదివారం 26.04.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

ఎంపీడీవోల బదిలీలకు రంగం సిద్ధం

- మే 1లోగా వివరాలు ఇవ్వాలని ఆదేశాలు

టి మీడియా, ఏప్రిల్ 25 , హైదరాబాద్ బ్యూరో :

మండల పరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీవో) బదిలీల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆర్థిక శాఖ ఇచ్చిన జీవో మేరకు ఎంపీడీవోల బదిలీలు, పోస్టింగ్ కోసం ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వం కోరింది.రాష్ట్రంలోని అన్ని జిల్లాల పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారులు(సీఈవో), తమ పరిధిలో పనిచేస్తున్న ఎంపీడీవోల పూర్తి వివరాలను సమర్పించాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశించారు. అవసరమైన సమాచారాన్ని హార్డ్, సాఫ్ట్ కాపీల రూపంలో మే 1 లోపు ఈ-సెక్షన్ మెయిల్ ఐడీకి (ఎజూతీ.వ.ంవఖీఅశీఅఏస్త్రమఖఅశ్రీ. ఎశీవ) పంపాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం మే మొదటి వారం తర్వాత బదిలీల తుది జాబితాను వెల్లడించే అవకాశం ఉన్నది.

త్వరలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియను వేగవంతం చేసింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆర్థిక శాఖ జారీ చేసిన జీవో మేరకు, గ్రేడ్-×, ××, ××× పంచాయతీ కార్యదర్శుల బదిలీ లు, పోస్టింగ్ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్ని జిల్లాల పంచాయతీ అధికారులు, తమ పరిధి లో పనిచేస్తున్న అర్హులైన పంచాయతీ కార్యదర్శుల పూర్తి వివరాలను సమర్పించాలని శుక్రవారం పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీచేశారు.

పాక్‌లో నీటి కొరత



- సింధూ జలాల ఒప్పందాన్ని నిలివేసిన భారత్
- భారత్‌తో చర్చలకు వచ్చే యోచనలో పాకిస్థాన్

టీ మీడియా, ఏప్రిల్ 25, ఢిల్లీ బ్యూరో : పాకిస్థాన్ ప్రస్తుతం తీవ్ర నీటి ఎద్దడితో అల్లాడుతోంది. ఆ దేశ వ్యవసాయ రంగం కుదేలయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ దుస్థితిలో భారత్‌తో కాళ్ల బేరానికి పాక్ వచ్చే అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు అంచనా వేస్తున్నారు. 2025లో పహల్గాం ఉగ్రదాడి అనంతరం సింధూ నదీజలాల ఒప్పందం అమలును భారత్ ఆపేసింది. ఆ ఒప్పందాన్ని పునరుద్ధరించే మాటనే భారత్ ఎత్తడం లేదు. నీటి ఎద్దడి నేపథ్యంలో పాక్ మొండివైఖరిని వీడి భారత్‌తో చర్చలకు వచ్చే సూచనలు ఉన్నాయని మాజీ బ్యూరోక్రాట్ కేబీఎస్ సింధు అంటున్నారు. ఈసారి పాక్ చర్చలకు వచ్చినప్పుడు, భారత్‌తో సరి సమాన భాగస్వామిగా కాకుండా నీటి సంక్షోభంలో ఉన్న దేశంగా వస్తుందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో పాక్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ధ్రువీకరించదగిన చర్యలతో ముడిపడి ఉండాలని సూచించారు.

భౌగోళిక రాజకీయ ప్రయోజనంగా మార్చుకోవాలి!

2025 సంవత్సరంలో పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధూ నదీజలాల ఒప్పందం అమలును భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై ఆనాడు భారత్ తీసుకున్న ఈ చర్యపై మళ్లీ చర్చ మొదలైంది. జల భద్రత, సార్వభౌమాధికారం, దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రణాళిక అనే కీలకమైన కోణాల్లో దీనిపై ఇప్పుడు డిస్కషన్ జరుగుతోంది. పాక్‌పై తీసుకున్న ఈ చర్యను ఒక శాశ్వత జలసంబంధ, భౌగోళిక రాజకీయ ప్రయోజనంగా భారత్ మార్చుకోవాలని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు సూచిస్తున్నారు.

అది అవివేకమైన ఉదారతా చర్య

1960లో భారత్- పాక్ మధ్య కుదిరిన సింధూ నదీజలాల ఒప్పందాన్ని ఒక అసాధారణమైన, అవివేకమైన ఉదారతా చర్యగా మాజీ బ్యూరోక్రాట్ కేబీఎస్ సింధు అభివర్ణించారు. సద్భావనతో మెలుగుతుందనే అంచనాలతో ఆనాడు సింధూ నదీజలాల్లో మెజారిటీ వాటాను పాకిస్థాన్‌కు భారత్ వదులుకుందని ఆయన తెలిపారు. నాగరిక, అంతర్రాష్ట్ర సంబంధాల నిబంధనలకు పాక్ కట్టుబడి ఉంటుందా ఉండదా అనే దానిపై ఈ ఒప్పందం మనుగడ ఆధారపడి ఉందన్నారు. అయితే ఈ ఒప్పందం యథాతథంగా మాత్రం కొనసాగలేదని కేబీఎస్ సింధు అభిప్రాయపడ్డారు.

నదీజలాల పంపిణీలో అసమతుల్యత దిగ్భ్రాంతికరం

"సింధూ నదీజలాల ఒప్పందం ఫలితంగా ఈ బేసిన్ పరిధిలోని మొత్తం నీటి ప్రవాహంలో దాదాపు 80 శాతం పాక్‌కు లభించింది. ఆనాడు ఇంత అసమతుల్యంగా నదీజలాల పంపిణీ జరగడం దిగ్భ్రాంతి కలిగించే అంశం. సింధూ నదికి ఎగువన ఉన్న దేశం అయినప్పటికీ భారతదేశం స్వచ్ఛందంగా తనను తాను తక్కువ నీటి వాటాకు
పరిమితం చేసుకుంది. ఫలితంగా దిగువన ఉన్న పాకిస్థాన్ ఈ నదీజలాల కేటాయింపుతో ప్రయోజనాన్ని పొందింది. సింధూ నదీజలాల ఒప్పందం అమలును నిలిపివేసే చర్యను ఎన్నడో తీసుకొని ఉండాల్సింది. కానీ ఎట్టకేలకు 2025లో తీసుకున్నారు. ఈ చర్య చట్టపరంగానూ సమర్థనీయమైందే. ఎందుకంటే పాకిస్థాన్ చాలా దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ చట్టాలను అపహాస్యం చేస్తోంది. ఉగ్రవాదులను ఎగుమతి చేసే పనిని చేస్తున్న పాకిస్థాన్‌కు భారత్ తగిన శాస్తి చేసింది. పాక్ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తున్న సింధూ నదీజలాల ఒప్పందాన్ని భారత్ నిలుపుదల చేయడం సరైన చర్యే. ఆ ఒప్పందాన్ని కొనసాగించాల్సిన అవసరం భారత్‌కు చట్టపరంగా కానీ, మనస్సాక్షి పరంగా కానీ లేనే లేదు" అని సేవియర్స్ మ్యాగజైన్‌లో రాసిన విశ్లేషణలో కేబీఎస్ సింధు ప్రస్తావించారు.

నీటి హక్కుల వినియోగంలో భారత్ వెనుకంజ

"దేశ సరిహద్దు ప్రాంతాల్లో భారత్ తన నీటి హక్కులను సక్రమంగా వినియోగించుకోవడం లేదు. రంజిత్ సాగర్ డ్యామ్, షాపూర్ కండి డ్యామ్ వంటి ప్రాజెక్టుల నిర్మాణ పనులు దశాబ్దాల తరబడి ఆలస్యమయ్యాయి. దీంతో గణనీయమైన పరిమాణంలో నదుల నీరు పాక్‌లోకి ప్రవహించింది. ఓ వైపు భారత్‌లోని పంజాబ్‌లో భూగర్భ జలమట్టాలు తగ్గుతున్నాయి. మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో జాప్యం వల్ల ప్రతి ఏడాది భారతదేశానికి చెందిన రావి నది జలాల్లో దాదాపు 26.136 టీఎంసీల నీరు పాక్‌లోకి చేరుతోంది.

సింధూ నదీజలాల ఒప్పందం ప్రకారం పరిమిత నిల్వ, జలవిద్యుత్ అభివృద్ధికి మాత్రమే అనుమతి ఉన్న పశ్చిమ నదుల విషయంలోనూ భారతదేశం వెనుకబడింది. 156.82 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టులను నిర్మించుకోవడానికి మన దేశానికి అనుమతి ఉంది. అయినప్పటికీ చాలా తక్కువ మోతాదులోనే నదుల నీటిని మనం నిల్వ చేసుకోగలుగుతున్నాం. ఇక 18 గిగావాట్లకుపైగా ఉన్న జలవిద్యుత్ సామర్థ్యాన్ని సైతాన్ని భారత్ అందిపుచ్చుకో లేకపోతోంది" అని కేబీఎస్ సింధు పేర్కొన్నారు.

పంజాబ్‌లో జల సంక్షోభం

"భారత్‌లోని కిషన్‌గంగా, రాటిల్ జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలపై పాకిస్థాన్ రాద్ధాంతం చేస్తోంది. అవి సింధూ నదీ జలాల ఒప్పందానికి అనుగుణంగా లేవని వాదిస్తోంది. ఈ అభ్యంతరాలు, మధ్యవర్తిత్వ విచారణల వల్ల భారత్ చేపట్టిన పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పనుల్లో జాప్యం జరుగుతోంది. అంతర్జాతీయ నిబంధనలు అనేవి జాతీయ ప్రయోజనాల ప్రాతిపదికనే రూపుదిద్దుకుంటాయి. ఈ లెక్కన భారత్ చర్యలు సరైనవే. ప్రపంచ దేశాలు తమ సార్వభౌమ మనుగడ కోసం, జాతీయ ప్రయోజనాల కోసం ఒప్పందాలను పక్కన పెట్టొచ్చు. ప్రస్తుతం పంజాబ్‌లో భూగర్భ జల మట్టాలు తగ్గుతున్నాయి. ఇది భారత వ్యవసాయ రంగానికి, జాతీయ భద్రతకు సవాలు లాంటి అంశం. దీనివల్ల సామాజిక అస్థిరత, ఆర్థిక అవాంతరాలు ఏర్పడొచ్చు. ఈ సమస్య పరిష్కారం కోసం పశ్చిమ నదుల నుంచి ఉత్తర భారత రాష్ట్రాలకు నీటిని మళ్లించేందుకు భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపట్టొచ్చు. మార్కు టన్నెల్ మీదుగా చీనాబ్-రావి డైవర్షన్ జల ప్రాజెక్టును నిర్మించొచ్చు. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాలకు జలభద్రత లభిస్తుంది. బుర్సార్, సవాల్‌కోట్ వంటి ప్రధాన జలాశయ ఆనకట్టలను నిర్మించాలి. జీలం, బియాస్ నదులను కలిపే అంతర్-బేసిన్ బదిలీ వ్యవస్థల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. ఈ ప్రాజెక్టులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించాలి. వీటిని జాతీయ భద్రతా ప్రాధాన్యతలుగా పరిగణించి వేగవంతమైన అనుమతులను మంజూరు చేయాలి" అని కేబీఎస్ సింధు ప్రతిపాదించారు.

వ్యూహాత్మక మార్పునకు నాంది

"భారత్‌లోని సింధూ నది పరిధిలో చేపట్టే ప్రాజెక్టుల ప్రణాళిక, అమలును పర్యవేక్షించేందుకు జాతీయ సింధు బేసిన్ అథారిటీని ఏర్పాటు చేయాలి. ఆ ప్రాజెక్టుల ఆమోద ప్రక్రియను క్రమబద్ధీకరించి, అధికారిక జాప్యాలను తగ్గించాలి. సింధూనదీ జలాల ఒప్పందం నిలిపివేత అనేది ఒక విస్తృత వ్యూహాత్మక మార్పునకు నాంది లాంటిది. తదుపరిగా ప్రతీకారం తీర్చుకోవడమో లేదా వార్తా శీర్షికల కోసం పోటీపడటమో జరగదు. సింధూ నదీజలాల ఒప్పందాన్ని ఒక వ్యూహాత్మక ప్రయోజనకర అంశంగా మార్చడం అనేది తదుపరిగా భారత్ తరఫున జరగాలి" అని కేబీఎస్ సింధు విశ్లేషించారు.

ఇంధన కొరతపై సీఎం సమీక్ష

- తక్షణ చర్యలకు ఆదేశం

టి మీడియా, ఏప్రిల్ 25 , అమరావతి :

రాష్ట్రంలో తలెత్తిన ఇంధన కొరతపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం సమీక్షించారు. పలు జిల్లాల్లో పెట్రోల్ బంకులు మూతపడటంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీఎం

ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని సీఎస్ సాయిప్రసాద్, పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలన్నారు. పెట్రోల్ బంకుల యజమానులు, ఆయిల్ కంపెనీలతో మాట్లాడి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు.

10 శాతం అదనపు ఇంధన సరఫరా

సీఎం ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. పౌరసరఫరాల శాఖ అధికారులు పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్‌తో ఫోన్‌లో చర్చించారు. స్టాక్ లేని బంకుల వివరాలను వెంటనే అందించాలని ఆదేశించారు. దీంతో రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ జిల్లాల అధ్యక్షులకు సమాచారం పంపింది. స్టాక్ సమస్య ఉన్న డీలర్లు టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫోన్‌చేసి వివరాలు నమోదు చేయాలని పౌరసరఫరాల కమిషనర్ కోరారు. కాగా, గత ఏప్రిల్ కంటే 10 శాతం అదనపు ఇంధన సరఫరా
చేసేందుకు ఆయిల్ కంపెనీలు అంగీకరించాయి.

క్షేత్రస్థాయి నివేదిక

పెట్రోల్ డీలర్ల నుంచి ఏపీఎఫ్‌పీటీ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి పేరం రవికుమార్ వివరాలు సేకరిస్తున్నారు. ఆయిల్ కంపెనీల సరఫరా తీరుపై క్షేత్రస్థాయి నివేదికను కమిషనర్‌కు సమర్పించేందుకు అసోసియేషన్ కసరత్తు చేస్తోంది. రానున్న రోజుల్లో ఇంధన కొరత ఉండబోదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

కొరతతో కష్టాలు

రాష్ట్రంలో ఇంధన కొరత సెగలు పుట్టిస్తోంది. ఇదిలా ఉండగా మరోవైపు ఉమ్మడి గోదావరి జిల్లాల్లో డీజిల్ కొరత వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తోంది. రబీ కోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో డీజిల్ దొరక్క వరికోత యంత్రాలకు ఆటంకం కలుగుతోంది. అటు ఆక్వా రైతులు, ఇటు వాహనదారులు చమురు కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 10 ఎకరాల వరి కోయాలంటే యంత్రం కనీసం 10 నుంచి 15 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. దీనికోసం రోజుకు 100 నుంచి 160 లీటర్ల డీజిల్ అవసరం. కానీ గ్రామీణ ప్రాంతాల్లోని బంకుల్లో స్టాక్ లేకపోవడంతో యంత్రాలు షెడ్లకే పరిమితమయ్యాయి. ఉన్నచోట కూడా ఒక్కొక్కరికి 50 లీటర్లకు మించి ఇవ్వడం లేదు.

కొత్త రాజకీయ పార్టీ ప్రకటించిన కవిత

'టీఆర్ఎస్'గా నామకరణం

టి మీడియా, ఏప్రిల్ 25 ,మేడ్చల్ :

తెలంగాణ రాష్ట్రంలో సూతన పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల **కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్?)'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కల్వకుంట్ల కవిత ప్రకటించారు.మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా నూతన రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త పార్టీని ప్రకటించారు. పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేసినట్లు ఆమె వెల్లడించారు. నేడు పార్టీ ప్రకటన నేపథ్యంలో ఉదయం ఇంట్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించిన కవిత, తన భర్త, కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం గన్‌పార్కు వద్దకు చేరుకొని తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అక్కడి నుంచి మునీరాబాద్‌కు ర్యాలీగా బయల్దేరారు. తెలంగాణలో కొత్త విప్లవం మొదలైందని, ప్రజలు ఆశీర్వాదంతో కచ్చితంగా ముఖ్యమంత్రి అయ్యి తీరుతానని కవిత ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేసిన కవిత, తెలంగాణ జాగృతి పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. 2014లో నిజామాబాద్ నుంచి టీఆర్?ఎస్? తరఫున లోక్?సభకు ఎన్నికైన ఆమె, 2018లో ఓటమి పాలయ్యారు. అనంతరం రెండు దఫాలు నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. దిల్లీ మద్యం కేసులో అరెస్ట్, బెయిల్ తదనంతర పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, విధానాలతో కవిత విభేదిస్తూ వచ్చారు. నేతలు, పార్టీపై బహిరంగ విమర్శలు చేయడంతో 2025 సెప్టెంబర్ 2న ఆమెను పార్టీ సస్పెండ్ చేసింది. ఆ మరుసటి రోజే బీఆర్ఎస్ పార్టీకి, శాసన మండలి సభ్యత్వానికి కవిత రాజీనామా చేశారు.**

మిత్రులారా,
మేడే MAY DAY
వస్తోంది..
MEDIA
తెలుగు డిజిటల్
జెండా ఆవిష్కరణలు, సభలు ఉంటాయి.
కార్మికుల దినోత్సవం (పండుగ).
కార్మికుల పక్షాన నిలిచే మీడియా మన
టి మీడియా (తెలుగు డిజిటల్) ప్రత్యేక ప్యాకేజీ ద్వారా
కార్మికులకు పండుగ శుభాకాంక్షలు తెలపండి.
మేడే స్పెషల్ - ప్రత్యేక ప్రకటనలు
డైలీ పేజీ రేట్లు
NEWS
మొదటి పేజీ ఫుల్ రూ.7,000/-
లోపలి పేజీ ఫుల్ రూ.4,000/-
మాత్రమే
వెబ్‌సైట్ రేట్లు
రూ.1,000/- మాత్రమే
·వీడియో / ఆడియో వాయిస్,
ఫోటోతో ఆర్టికల్,
లేదా రోజువారి వార్తల్లో డిజైన్.
వివరాలకు సంప్రదించండి:
8919710365, 7382990365
కాల్ చేయండి
కార్మికుల బలం దేశ అభివృద్ధికి నడిపే శక్తి!

అజారుద్దీన్, కోదండరాం కు లైన్ క్లియర్

గవర్నర్ శివప్రతాప్ శుక్లా కీలక నిర్ణయం

టి మీడియా, ఏప్రిల్ 25 , హైదరాబాద్ బ్యూరో :

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మాజీ టీమిండియా క్రికెటర్ అజారుద్దీన్, ఎం. కోదండరాం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు గవర్నర్ ఆమోదం తెలిపారు. దీంతో అజారుద్దీన్, కోదండరాం ఇద్దరూ మండలికి వెళ్లడం ఖరారైంది. గత ఏడాది ఆగస్ట్ 30న ఈ ఇద్దరిని ఎమ్మెల్సీలుగా నియమించాలని తెలంగాణ కేబినెట్ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపింది. అయితే అప్పటి నుంచి ఈ ఫైల్ పెండింగ్‌లోనే ఉంది.ఇప్పుడు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పరిస్థితి మారింది. ముఖ్యంగా అజారుద్దీన్ మంత్రి పదవి.. ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపైనే ఆధారపడి ఉండటంతో తాజా నిర్ణయంతో ఆయన మంత్రిగా కొనసాగడం స్పష్టమైంది.

స్వయంగా కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..

తెలంగాణ కేబినెట్‌లో మంత్రిగా ఉన్న అజారుద్దీన్.. పదవిలో కొనసాగాలంటే ఏప్రిల్ 30 లోపు శాసనమండలి సభ్యుడిగా ఎన్నికవ్వడం తప్పనిసరి.. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వారు ఆరు నెలల లోపు ఏదో ఒక సభలో సభ్యత్వం పొందాల్సి ఉంది.. ఒకవేళ ఏప్రిల్ 30 లోపు గవర్నర్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోతే అజారుద్దీన్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే.. ఇంతకాలం గవర్నర్ కోటాలో పెండింగ్ లో ఉన్న అజారుద్దీన్, కోదండరాం పేర్లను పరిశీలించాలని.. గ్రీన్ సిగ్నన్ ఇవ్వాలని.. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కలిసి సుధీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలోనే.. వారి అభ్యర్థిత్వాలకు గవర్నర్ ఆమోదించారు.

అర్ధరాత్రి చేరుకుంటే ఇబ్బందులే

- ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు తిప్పలు

టీ మీడియా, ఏప్రిల్ 25 , గుంటూరు :

గుంటూరులో పగటిపూట వసూలు చేసే సాధారణ ఛార్జీల కంటే గమ్యస్థానాన్ని బట్టి రూ.50 నుంచి రూ.70 వరకు ఆటో డ్రైవర్లు అధికంగా వసూలు చేస్తున్నారు. దీంతో రైళ్ల నుంచి దిగే ప్రయాణికులు నిస్సహాయ స్థితిలో పడిపోతున్నారు. స్టేషన్ బయట వేచి ఉన్న ఆటోలను ఆశ్రయించడం తప్ప వారికి వేరే మార్గం ఉండటం లేదు. డ్రైవర్లు ఎంత ఛార్జీ అడిగితే అంత చెల్లించక తప్పడం లేదు. ఎవరైనా నిరాకరిస్తే వారు మొండిగా వ్యవహరిస్తున్నారు. అయితే కాస్త ఓపిక వహించి స్టేషన్ ఆవరణ దాటి బయటకు వచ్చి బేరమాడితే ఛార్జీని కొంతమేర తగ్గించుకునే అవకాశం ఉంటుంది. ఆర్టీసీ బస్టాండ్ బయట ఉన్న నాలుగు ఆటో స్టాండ్ల వద్ద డ్రైవర్లు ఒక సంఘంగా ఏర్పడి ఛార్జీలను అందరూ కలిసి నిర్ణయించి వసూలు చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల మధ్య ఆర్టీసీ బస్టాండ్ రైల్వే స్టేషన్ వద్ద ఈటీవీ - ఈటీవీ భారత్ తనిఖీ నిర్వహించి పలు సమస్యలను వెలుగులోకి తెచ్చింది.

రుసుము చెల్లింపు

స్టేషన్ తూర్పు వైపున ఆరు నెలల కాలానికి రూ.1,500 నిర్ణీత రుసుము చెల్లించి పార్కింగ్ చేసుకోవడానికి 116 ఆటోలకు అనుమతి ఉంది. పశ్చిమ వైపున ఈ సంఖ్య సుమారు 170గా ఉంది. కేవలం ఈ నిర్దిష్ట వాహనాలకు మాత్రమే స్టేషన్ ఆవరణలోకి ప్రవేశించే అధికారం ఉంది. అయితే రాపిడో, ఉబెర్ లేదా ఓలా వంటి సేవలను వినియోగించుకోవాలనుకునే ప్రయాణికులు తమ వాహనాన్ని ఎక్కడానికి ప్రధాన రహదారి వరకు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది.

రైల్వే స్టేషన్ వద్ద

అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల మధ్య నారాయణాద్రి, కొండవీడు, అమరావతి, నరసాపురం, సికింద్రాబాద్ డెల్టా, రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు వచ్చాయి. ఎ టి అగ్రహారం 4వ లైన్‌కు వెళ్లడానికి ఆటో డ్రైవర్లు రూ.120 ఛార్జీని డిమాండ్ చేశారు. 13వ, 14వ 15వ లైన్లకు అయితే వారు రూ.150 వరకు అడిగారు. ఇన్నర్? రింగ్? రోడ్?కు వెళ్లడానికి ఛార్జీ రూ.180 గా ఉంది. ప్రయాణికుల బృందంలో కనీసం ముగ్గురు వ్యక్తులు ఉంటేనే డ్రైవర్లు వారిని ఎక్కించుకోవడానికి సిద్ధంగా ఉంటున్నారు. ఇక్కడి నుంచి బస్టాండ్‌కు వెళ్లడానికి, షేరింగ్ పద్ధతిలో ఛార్జీ రూ.20 నుంచి రూ. 30 వరకు ఉంటుంది. అయితే ఎవరైనా ఒక్కరే ప్రయాణించాలనుకుంటే ఛార్జీ రూ.80గా ఉంటుంది. కొత్త గుంటూరు స్టేషన్?కు పగటిపూట ఛార్జీ రూ.120 కాగా, రాత్రిపూట అది రూ.200కు పెరుగుతుంది. పగటిపూట నల్లపాడుకు రూ.200 తెనాలికి రూ.600 చొప్పున వారు వసూలు చేస్తున్నారు.

ఆర్ టి సి బస్టాండ్ వద్ద

రాత్రి 11 గంటల తర్వాత ఫ్యాన్లు ఆపేస్తారు. అర్ధరాత్రి వేళ చేరుకునే ప్రయాణికులు ఉదయం 4:30 గంటల వరకు వేచి ఉండక తప్పడం లేదు. దుకాణాలు వస్తువుల గరిష్ట చిల్లర ధర ఎమ్ ఆర్ పి కంటే అదనంగా రూ.5 ఎక్కువ వసూలు చేస్తున్నాయి. మరుగుదొడ్లను ఉపయోగించుకున్నందుకు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. బిచ్చగాళ్లు, అలాగే మద్యం లేదా గంజాయి మత్తులో ఉన్న వ్యక్తులు బస్టాండ్ బెంచీలపై నిద్రిస్తున్నారు. పోలీసు అవుట్‌పోస్ట్ రాత్రి 12 గంటలకే మూసివేస్తారు. అక్కడ ఉన్న నాలుగు ఆటో-రిక్షా స్టాండ్‌ల నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్న యూనియన్ నిర్ణయించిన ఛార్జీలనే ప్రయాణికులు చెల్లించాల్సి వస్తోంది. రత్నగిరికి వెళ్లడానికి వారు రూ.150 కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారు. ఒకవేళ ప్రయాణికుల బృందం పెద్దదిగా ఉంటే ఒక్కొక్కరి నుంచి రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక్కడ ఉన్న సమస్యలు ఇవే రైల్వే స్టేషన్ వద్ద ఉన్న మరుగుదొడ్లను రాత్రి 10 గంటల తర్వాత మూసివేస్తున్నారు. దీనివల్ల మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్యం, గంజాయి మత్తులో ఉన్న వ్యక్తుల గుంపులు వారిని వేధిస్తున్నాయి. స్టేషన్? రోడ్? ప్రాంతం ముందు ట్రాఫిక్ రద్దీ తీవ్రమైన సమస్యగా మారింది. అర్ధరాత్రి వేళ పోలీసు సిబ్బంది ఆటో-రిక్షాలను ప్రయాణికులను ఆపి వారి నుంచి రూ.50 నుంచి రూ.100 వరకు మొత్తాన్ని వసూలు చేస్తున్నారు. రాత్రి 10 గంటల తర్వాత రైల్వే స్టేషన్‌కు బస్సులు రావడం లేదు.

గుంటూరు రైల్వే స్టేషన్?కు 24 గంటల వ్యవధిలో సుమారు 90 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతిరోజూ దాదాపు 10,000 మంది ప్రయాణికులు ఈ స్టేషన్ ద్వారా ప్రయాణిస్తుంటారు. వీరిలో సుమారు 4,000 మంది ప్రయాణికులు రాత్రి వేళల్లో చేరుకుంటారు. అర్ధరాత్రి (12 గావీ) నుంచి ఉదయం 5 గంటల మధ్య స్టేషన్‌లో సుమారు 2,000 మంది వ్యక్తులు ఉంటారు. వీరిలో అత్యధికులు రాయగడ రైలు కోసం వచ్చే ప్రయాణికులే.

పనిచేయని ఫ్యాన్ల వల్ల ఇబ్బందులు

"నేను విజయవాడ నుంచి ఆర్ టి సి బస్ స్టాండ్‌కు అర్ధరాత్రి 12 గంటలకు చేరుకున్నాను. పెదనందిపాడు వెళ్లడానికి నేను ఉదయం 4:30 గంటలకు వచ్చే పర్చూరు బస్సు కోసం వేచి ఉండాలి. అప్పటి వరకు వేచి ఉండక తప్పని పరిస్థితి నాకు ఏర్పడింది. అయితే రాత్రి 11 గంటల తర్వాత బస్ స్టాండ్‌లోని ఫ్యాన్లను ఆపివేస్తున్నారు" అని పెదనందిపాడుకు చెందిన కుమార్ చెప్పుకొచ్చారు.



"అన్నా" అన్నందుకే ఆగ్రహం..

- ఎస్సై దాడిసెలూన్‌లో సీసీటీవీకి రికార్డైన ఘటనసోషల్

టి మీడియా, ఏప్రిల్ 25 , కరీంనగర్ :

జిల్లాలో పోలీస్ అధికారి అత్యుత్సాహం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ కేవలం తనను 'అన్నా' అని పిలిచినందుకు ఒక సామాన్య కార్మికుడిపై భౌతిక దాడికి దిగడం తీవ్ర కలకలం రేపింది. నగరంలోని ఖానాపూర్ ఏరియాలో ఉన్న ఒక సెలూన్‌కు కరీంనగర్ త్రీటౌన్ ఎస్సై షేవింగ్ చేయించుకోవడానికి వెళ్లారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న రాము అనే వర్కర్, ఎస్సైని ఉద్దేశించి గౌరవంగా "కూర్చో అన్నా" అని పలికారు. అయితే, ఆ పిలుపు విని సదరు అధికారి ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు. విద్య, వైద్యం ఉచితం.. 4 లక్షల ఉద్యోగాలే లక్ష్యం!"నన్నే అన్నా అంటావా?" అంటూ మండిపడ్డ ఎస్సై, తన హోదాను అడ్డం పెట్టుకుని రాముపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఒక సామాన్యుడు తనను 'అన్నా' అని సంబోధించడం ఆ అధికారి అహంకారాన్ని దెబ్బతీసినట్లుగా ఆయన ప్రవర్తన ఉంది. సెలూన్‌లో అందరూ చూస్తుండగానే బాధితుడిపై చేయి చేసుకుని అసభ్య పదజాలంతో దూషించారు. ఈ దౌర్జన్యానికి సంబంధించిన దృశ్యాలన్నీ సెలూన్‌లోని సిసిటీవీ కెమెరాలో స్పష్టంగా రికార్డయ్యాయి. ఎస్సై వర్కర్‌ను కొట్టడం, దురుసుగా ప్రవర్తించడం వంటి విజువల్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వీడియో చూసిన నెటిజన్లు "ఇదేనా మీ ఫ్రెండ్లీ పోలీసింగ్?" అంటూ పోలీస్ శాఖపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. సామాన్యులపై ఇలాంటి దాడులు పోలీస్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యుడైన త్రీటౌన్ ఎస్సైపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు , స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణికుల కోసం పోలీసుల చలివేంద్రం

- మంచిర్యాల డీసీసీ భాస్కర్

టి మీడియా, ఏప్రిల్ 25 , బెల్లంపల్లి:

పోలీసులంటే శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పనిచేస్తారని, అదే వారి ప్రధమ ముఖ్య భూమిక అని అందరూ అనుకుంటారు. కానీ ప్రజల సంక్షేమం కూడా తమ భాధ్యత అని బెల్లంపల్లి పోలీసులు నిరూపించారు. వేసవి కాలాన్ని పురస్కరించుకొని ఎండ దెబ్బ నుండి ప్రజలను కాపాడాలనే సదుద్దేశంతో బెల్లంపల్లి కాల్ టెక్స్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి టీ జంక్షన్ వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ. వేసవికాలంలో ప్రయాణించే ప్రజల దహార్ని తీర్చడం కోసం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. వడదెబ్బ,డిహైడ్రేషన్ నుంచి ప్రయాణికులను రక్షించేందుకు ఈ చలివేంద్రం ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. దాహం తీర్చడం వల్ల ఎండ దెబ్బ ముప్పు నుంచి ప్రయాణికులు రక్షణ పొందుతారన్నారు. ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరడంతో నిప్పులు కురిపిస్తున్న ఎండ వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు వేసవిలో ప్రయాణించవద్దన్నారు. పిల్లలను సైతం ఎండలో తిరగనియ్యద్దన్నారు. పిల్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని కోరారు. పిల్లలకు వాహనాలు ఇచ్చి ఎండలో తిరిగి అవకాశాన్ని నివారించాలని కోరారు. రోడ్డు ప్రమాదాలతో పాటు వడదెబ్బలకు గురయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల బెల్లంపల్లి పోలీసులను డీసీపీ భాస్కర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్, టూ టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్, తాళ్ళు గురజాల ఎస్సై

డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయిన 47 మంది మావోయిస్టులు

టి మీడియా, ఏప్రిల్ 25 , హైదరాబాద్ బ్యూరో :

తెలంగాణ పోలీసుల ముందు మరోసారి భారీగా మావోయిస్టులు లొంగిపోయారు. హైదరాబాద్?లో తెలంగాణ డీజీపీ శివధర్? రెడ్డి ఎదుట 47 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అందులో దండకారుణ్య సౌత్?జోన్?కు చెందిన కీలకమైన నాయకులు హేమ్లా ఐతు అలియాస్ విజ్జా, పోడియం లచ్చు అలియాస్ మనోజ్ కూడా ఉన్నారు. మావోయిస్టులు 32 తుపాకులు, 515 తూటాలను పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ సౌత్? బస్తర్?, దండకారణ్య సౌత్? డివిజన్?కు చెందిన కీలకమైన వారు లొంగిపోయారని వెల్లడించారు. ఇవాళ సరెండర్ అయిన వారిలో తెలంగాణ వాళ్లు ఎవరూ లేరన్నారు. సరెండర్ అయిన వారికి రూ.1.20 కోట్ల పునరావాస ప్యాకేజీ అందిస్తామని చెప్పారు. అదనంగా కేంద్రప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహం కూడా అందిస్తామన్నారు. అలాగే వీరికి హెల్త్? కార్డులను కూడా అందజేస్తామన్నారు.

ఇప్పటి వరకు 250 మంది మావోలు లొంగిపోయారు

తెలంగాణ పునరావాస విధానానికి ఆకర్షితులై 47 మంది మావోయిస్టులు రాష్ట్రంలో లొంగిపోయారని డీజీపీ తెలిపారు. లొంగిపోయిన వారికి మొత్తం రూ.1.5 కోట్ల రివార్డు ఉందన్నారు. ఒక్కొక్కరికి రూ.25,000 తక్షణ సహాయం చేస్తున్నామని వివరించారు. కీలక నాయకత్వం లొంగిపోయవడంతో మావోయిస్టు నిర్మాణం పూర్తిగా బలహీన పడిందన్నారు. 2026లో ఇప్పటి వరకు 260 మంది మావోలు లొంగిపోయారన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 238 తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లుగా శివధర్ రెడ్డి చెప్పారు.

అమరావతిలో కొత్త జోష్

- తుది దశకు సీఎం చంద్రబాబు నివాసం

టి మీడియా, ఏప్రిల్ 25 , అమరావతి :



అమరావతిలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల విల్లాల నిర్మాణాలు పూర్తయ్యాయి. తాజాగా సీఎం చంద్రబాబు నివాస నిర్మాణం కూడా పూర్తైంది. గత ఏడాది ఏప్రిల్ 9న శంకుస్థాపన చేసిన ఈ నివాసం ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. మరికొన్ని నెలల్లోనే గృహప్రవేశం జరిగే అవకాశం కనిపిస్తోంది. అయితే ఇది కేవలం ఒక ఇంటి నిర్మాణం మాత్రమే కాదు అధికార, ప్రజా కార్యక్రమాలకు కేంద్రంగా నిలిచే ప్రజా భవన్ కూడా ఇక్కడే రూపుదిద్దుకుంటోంది. సుమారు 25 వేల చదరపు గజాల్లో విస్తరించిన ఈ ప్రాజెక్ట్‌లో పచ్చదనానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. అత్యాధునిక సాంకేతికత, కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలతో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మంత్రి లోకేష్ స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ వేగం పెంచుతున్నారు. ఇక మౌలిక వసతుల విషయానికి వస్తే జు6 ప్రధాన రహదారి ఈ ప్రాంతానికి నూతన ఊపిరి పోస్తోంది. ఒకప్పుడు కురువలు పట్టిన ఈ నేల ఇప్పుడు సిమెంట్ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఐసిటి కేబుల్స్, గ్యాస్ పైప్‌లైన్లతో స్మార్ట్ ఇన్‌ఫ్రా హబ్‌గా మారింది. స్థానిక రైతులు కూడా ఈ మార్పుపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పారదర్శకంగా భూముల కొనుగోలు జరగడం, తమ ప్రాంతం అభివృద్ధి చెందడం గర్వకారణమని చెబుతున్నారు. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతం ఇప్పుడు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ స్థాయి వైపు దూసుకెళ్తోందని స్థానికులు అంటున్నారు. అమరావతి కేవలం ఒక రాజధాని మాత్రమే కాదని.. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు బలమైన పునాది అని ప్రజలు విశ్వసిస్తున్నారు.

భగభగ మండుతున్న ఎండలు

- కర్నూలు జిల్లాలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత

టి మీడియా, ఏప్రిల్ 25 , అమరావతిబ్యూరో :

రాష్ట్రంలో సూర్యుడి భగభగతో ఎండలు మండిపోతున్నాయి. మార్చి నెలలోనే ప్రారంభమైన ఎండల దడ ఇప్పుడు ఏప్రిల్? మాసంలో భయపెట్టిస్తోంది. ఉదయం 10 గంటలు దాటితే బయటకు రాలేని పరిస్థితి అంతటా నెలకొంది. దాంతో రానున్న మే నెలలో పరిస్థితి ఇంకెంత తీవ్రంగా ఉంటుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. భానుడి భగభగతో పగటిపూట ఆరు బయట కాలు పెట్టాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఎండల వల్ల మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకూ రహదారులపై జనసంచారం తక్కువగా కనిపిస్తోంది. ఆదివారం రాష్ట్రంలో 23 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. వడగాలులు, ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత: అదే విధంగా ఆదివారం విజయనగరం జిల్లా బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, మెంటాడ, రామభద్రాపురం, వంగర మండలాలు, పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పార్వతీపురం, సాలూరు, సీతానగరం, వీరఘట్టం మండలాలు, అల్లూరి జిల్లాలోని జీకే వీధి మండలం, పోలవరం జిల్లాలో చింతూరు, కూనవరం, వర రామచంద్రాపురం, గుర్తేడు మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని వెల్లడించారు. శనివారం మాత్రం అత్యధికంగా కర్నూలు జిల్లా నగరడోనలో 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం.

నగర వాసులు ఉక్కిరిబిక్కిరి

పగటిపూట ప్రయాణించేవారు టోపీలు, మాస్కులు, మహిళలైతే ముఖానికి వస్త్రాలు రక్షణగా ధరిస్తున్నారు. ఇక విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు ఎండలోనే ప్రయాణిస్తున్నారు. కొందరు వేసవి నుంచి ఉపశమనం కోసం చలివేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కొందరు కొబ్బరి బోండాలు, శీతల పానీయాల బళ్ల వద్దకు చేరుతున్నారు. భూతాపంతో ఎండలు ఎక్కువగా ఉండే విజయవాడ వంటి ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు నగర వాసుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఉపశమనం పొందేందుకు:

ఎండాకాలంలో ఎక్కడెక్కడో పని చేసుకొని ఇంటికి వచ్చేసరికి అలసట వచ్చేస్తుంది. చిన్న చిన్న పనులకే నీరస పడిపోతుంటాం. అలవాటు ఉన్న వాళ్లు అలసట బారి నుంచి ఉపశమనం పొందడానికి టీ, కాఫీ తీసుకుంటారు. కానీ వేసవిలో వేడి పదార్థాలు పెద్దగా రుచించవు. కాస్త చల్లచల్లగా ఏవైనా పళ్లరసాలు తీసుకుంటే బాగుంటుంది అనిపిస్తుంది. సహజ పానీయాలైన పళ్ల రసాలను తీసుకోవడమే మంచిదని, తద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని, అలసట దూరమవుతుందని పలువురు నిపుణులు సూచిస్తున్నారు.

కొబ్బరి నీళ్లు మేలు

వేసవి దాహార్తి తీర్చుకోవడంలో చాలా మంది కొబ్బరి నీళ్లకే మొగ్గు చూపుతారు. ప్రకృతి సిద్ధమైన కొబ్బరి నీళ్లు శరీరానికి ఎంతో మేలు చేయడంతో పాటు శరీరాన్ని నాజూగ్గా ఉంచడంలో సహకరిస్తాయి. బాగా అలసటగా అనిపించినప్పుడు కొబ్బరి నీళ్లలో నిమ్మరసం, తేనె, పుదీనా లేదా కొత్తిమీర, సబ్జా గింజలు వేసుకుని తాగితే సరిపోతుంది. నోటికి రుచిగా ఉండడంతో పాటు అలసటను తగ్గించడంలో కొబ్బరినీళ్లు మేలైన పనితీరును ప్రదర్శిస్తాయి.

వేసవిలో శరీరానికి చల్లదనాన్ని

- పోషకాలను అందించే పానీయం

టి మీడియా, ఏప్రిల్ 25 , ఆరోగ్యం :

వేసవి కాలం ప్రారంభమయ్యాక చల్లని పానీయాలు రోజువారీ జీవితంలో భాగమవుతాయి. మార్కెట్‌లో రెడీమేడ్ డ్రింక్స్, మిక్స్‌లు సులభంగా లభిస్తున్నప్పటికీ, సంప్రదాయ భారతీయ పానీయాలకు ప్రత్యేక స్థానం ఇప్పటికీ ఉంది. అలాంటి ప్రసిద్ధ పానీయాల్లో తండాయి ఒకటి. ఇది రుచితోపాటు శరీరాన్ని చల్లబరచే గుణాల వల్ల ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. సాధారణంగా హోలీ పండుగ సమయంలో ఎక్కువగా తయారుచేసే తండాయి, వేసవి మొత్తం తాగడానికి అనువైన పానీయం. పాలు, డ్రై ఫ్రూట్స్, సుగంధ ద్రవ్యాలు, గులాబీ రేకులు, కుంకుమపువ్వు కలిపి తయారు చేసే ఈ పానీయం శరీరానికి శక్తిని అందించడమే కాకుండా, తాగిన వెంటనే తాజాగా అనిపించేలా చేస్తుంది. ఇంట్లో తండాయి మసాలా తయారు చేసుకోవడం వల్ల మనకు కావలసిన రుచులు, తీపి స్థాయి అన్నీ మనమే నియంత్రించుకోవచ్చు.

ఇలా చేయాలి..

ఇంట్లో తండాయి మసాలా తయారీ చాలా సులభం. బాదం, జీడిపప్పు, పిస్తా వంటి డ్రై ఫ్రూట్స్‌తో పాటు సోంపు, గసగసాలు, యాలకులు, మిరియాలు వంటి సుగంధ ద్రవ్యాలు ప్రధానంగా ఉపయోగిస్తారు. వీటితోపాటు గులాబీ రేకులు, కుంకుమపువ్వు కూడా ప్రత్యేక సువాసనను ఇస్తాయి. తయారీ విధానంలో మొదట అన్ని డ్రై ఫ్రూట్స్, గింజలను శుభ్రంగా కడిగి పూర్తిగా ఆరబెట్టాలి. తేమ లేకుండా ఉండేలా చూసుకోవాలి. తరువాత యాలకులు, మిరియాలు, సోంపు, గసగసాలు మొదటగా మెత్తగా పొడి చేయాలి. తరువాత బాదం, జీడిపప్పు, పిస్తా, మెలన్ గింజలను వేసి కొద్దిగా దట్టంగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఆ తరువాత గులాబీ రేకులు, కుంకుమపువ్వు వేసి మరోసారి మిక్స్ చేయాలి. ఈ మిశ్రమం సువాసనతో కూడిన మసాలాగా తయారవుతుంది. పూర్తిగా చల్లారిన తరువాత గాలి చొరబడని సీసాలో నిల్వచేస్తే ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంటుంది.

చల్లని పాలలో కలిపి..

ఈ మసాలాతో తండాయి తయారు చేయడం కూడా చాలా ఈజీ. చల్లని పాలలో ఒకటి లేదా రెండు టీస్పూన్లు మసాలా కలిపి, అవసరమైతే చక్కెర వేసి బాగా కలిపి సర్వ్ చేస్తే చాలు. ఇది శరీరాన్ని లోపల నుంచి చల్లబరచడంలో సహాయపడుతుంది. ఇంట్లో తయారు చేసిన తండాయి మసాలా సహజమైన రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అయితే ఇది తీపి ఎక్కువగా ఉండే పానీయం కాబట్టి మితంగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

కానిస్టేబుల్ భార్య, అతడి కుమారుడ్ని కత్తితో పొడిచి చంపిన ప్రియురాలు

టీ మీడియా, ఏప్రిల్ 25,రాయ్‌పూర్:



ఒక మహిళ దారుణానికి పాల్పడింది. ప్రియుడైన కానిస్టేబుల్ భార్య, అతడి ముగ్గురు పిల్లలపై కత్తితో దాడి చేసింది. ఈ సంఘటనలో కానిస్టేబుల్ భార్య, అతడి కుమారుడు తీవ్ర గాయాలతో మరణించారు. అతడి ఇద్దరు కుమార్తెలు చికిత్స పొందుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం ఉదయం కానిస్టేబుల్ లలితేష్ యాదవ్ ప్రియురాలైన 25 ఏళ్ల సరోజిని భరద్వాజ్ అతడి ఇంటికి చేరుకున్నది. ఆ సమయంలో అతడు ఇంట్లో లేడు. తన కుటుంబం ప్రయాణం కోసం టిక్కెట్లు కొనడానికి రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. కాగా, కానిస్టేబుల్ భార్య రీనాతో సరోజిని వాగ్వాదానికి దిగింది. గొడవ బయటకు వినిపించకుండా టీవీ సౌండ్ పెంచింది. ఆ తర్వాత రీనా, ఆమె ముగ్గురు పిల్లలపై కత్తితో దాడి చేసింది. రీనాతో పాటు నిద్రిస్తున్న తొమ్మిదేళ్ల ఆదిత్యను పదేపదే కత్తితో పొడిచింది. అయితే కుమార్తెలు నైనా, తానియాపై సరోజిని కత్తితో దాడి చేస్తుండగా రీనా ప్రతిఘటించింది. ఆమె కాళ్లు పట్టుకుని తన పిల్లలను వదిలిపెట్టమని వేడుకున్నది. కుమార్తెలను పారిపోమని చెప్పింది. దీంతో ఒక కుమార్తె బాత్‌రూమ్‌లో దాక్కోగా, మరో కుమార్తె తప్పించుకుని బయటకు పరుగెత్తింది. పొరుగువారిని అప్రమత్తం చేసింది. మరోవైపు పొరుగువారు ఆ ఇంటికి చేరుకున్నారు. రక్తపు మరకలున్న కత్తితో తలుపు దగ్గర ఉన్న సరోజినిని చుట్టుముట్టి పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చి ఆమెను అప్పగించారు. రీనా, ఆమె పిల్లలను ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమెతో పాటు కుమారుడు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఇద్దరు కుమార్తెలు చికిత్స పొందుతున్నారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. కాగా, కానిస్టేబుల్ లలితేష్, సరోజిని మధ్య ఉన్న సంబంధం కారణంగా ఈ హత్యలు జరిగినట్లు పోలీస్ అధికారి తెలిపారు. శుక్రవారం కూడా ఆమె అతడి ఇంటికి రాగా నచ్చజెప్పి పంపించినట్లు తెలిసిందన్నారు. శనివారం లలితేష్ ఇంట్లో లేని సమయంలో వచ్చిన సరోజిని అక్కడ రక్తపాతం సృష్టించిందని చెప్పారు. అరెస్ట్ చేసి ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

టీ మీడియా, ఏప్రిల్ 25టేక్మాల్:



రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని టేక్మాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్ అన్నారు. శనివారం మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సర్మన్ కుంట తాండ లో రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్మన్ కుంట సర్పంచ్ దేవిక రంగులాల్ మెదక్ జిల్లా కాంగ్రెస్ మైనార్టీ కమిటీ చైర్మన్ షేక్ మజహర్ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం సీఈఓ వెంకటేష్ సంగ్య జీపీ సర్పంచ్ సక్కురు నాయక్ పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు తారా సింగ్, శంకర్, ప్రభు, హరి, రమేష్ మరియు పలువురు రైతులు, గ్రామస్తులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సోదరుడితో కలిసే మంగ్లీ మోసాలు

- మైక్రో ఫైనాన్స్ స్కామ్‌లో ఆమెకు ప్రత్యక్ష జోక్యం

టి మీడియా, ఏప్రిల్ 25 , ఖైరతాబాద్ :

మైక్రోఫైనాన్స్‌లో జరిగిన వందల కోట్ల స్కామ్‌లో సింగర్ మంగ్లీ ప్రత్యక్ష జోక్యం ఉందని, సోదరుడితో కలిసే మంగ్లీ తమను మోసగించిందని బాధితులు ఆరోపించారు. శుక్రవారం బంజారా సంఘాల ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో గిరిజన జేఏసీ అధ్యక్షుడు సంపత్ నాయక్ మాట్లాడారు. మంగ్లీ మీడియా సమక్షంలో అబద్ధాలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ప్రధాన నిందితుడు రమావత్ మధుతో మంగ్లీకి ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. స్కామ్‌లో అతనితో పాటు ఆమె కీలకంగా ఉన్నారని, తన సోదరుడిని తప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. తనకు ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదని అబద్ధాలు చెప్పిందని, 2024లో జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ తరపున పాటలు పాడి ప్రచారం చేశారని తెలిపారు. కర్ణాటకకు చెందిన ఓ మాజీ మంత్రి మనవడి వద్ద కూడా రూ.80లక్షల వరకు వసూలు చేశారని, ఆ ఫోన్ సంభాషణ వైరల్ అవుతున్నట్లు తెలిపారు.

అందులో మధు, మంగ్లీ సోదరుడు శివ ఈ లావాదేవీల్లో ఉన్నట్లు వెల్లడించారు. మధుకు సంబంధించిన పార్టీకి మంగ్లీ అనేక సార్లు హాజరయ్యారని, ఆమెకు సంబంధించిన కార్యక్రమాల్లోనూ మధు పాల్గొనేవాడని పేర్కొన్నారు. దానికి సంబంధించిన అన్ని వివరాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు.

అనంతరం గిరిజన జేఏసి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ రాథోడ్ మాట్లాడుతూ మైక్రోఫైనాన్స్ స్కామ్‌లో మంగ్లీ, ఆమె సోదరుడి ప్రత్యక్ష ప్రమేయం ఉందని, పోలీసులు కేసు దర్యాప్తును కావాలనే తాత్సారం చేస్తున్నారన్నారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనతరం రమావత్ మధు క్యాషియర్ రమేశ్ మట్లాడుతూ మంగ్లీతో మధుకు సంబంధం లేదన్నది పచ్చి అబద్ధమన్నారు. మంగ్లీ తరచూ మధు ఆఫీసుకు వస్తుండేవారని తెలిపారు. ఆమె సోదరుడు శివ ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా ఉన్నట్లు వెల్లడించారు. బాధితులందరూ తన సమక్షంలోనే పెట్టుబడులు పెట్టారని వెల్లడించారు.

రూ.50 లక్షలు ఇచ్చాను

రమావత్ మధుకు రూ.50లక్షలు ఇచ్చాను. లాభాలంటూ రూ.4లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొన్నాడు. ఎగుమతి, దిగుమతి వ్యాపారం, రియల్ ఎస్టేట్, ప్లాట్ ఇస్తామంటే నమ్మి డబ్బులు చెల్లించాను. నాతోపాటే మా గ్రామానికి చెందిన రమావత్ నగేశ్ రూ.24.50లక్షలు, రమావత్ పీక్యా రూ.60.50లక్షలు, చంద్యానాయక్ రూ.48 లక్షలు, రమావత్ కోటేశ్ 6.90కోట్లు, రమావత్ హన్మా రూ.1.42కోట్లు, హన్ను నాయక్ రూ.69లక్షలు, ఛత్రూనాయక్ రూ.1.4కోట్లు, ఇస్లావత్ జయ్ నాయక్ రూ 18.52 కోట్లు, లక్ష్మా రూ.2.37కోట్లు, లచ్చిరాం నాయక్, రూ.24లక్షలు, లక్ష్మానాయక్ రూ.29కోట్లు, శిల్ప రూ.11లక్షలు ఇలా ఒక్కొక్కరి వద్ద ఒక్కో రకమైన లాభాలు వస్తాయంటూ నమ్మించి వసూలు చేశారు.

రూ.4కోట్లు పెట్టుబడి పెట్టాను

మైక్రోఫైనాన్స్‌లో భాగా లాభాలు వస్తాయంటే నమ్మి చాలాచోట్ల డబ్బులు తెచ్చి కట్టాను. సుమారు రూ.4 కోట్లు వరకు పెట్టుబడి పెట్టాను. ఇప్పటి వరకు రూపాయి కూడా చెల్లించలేదు.

తప్పించుకునే ప్రయత్నం

మంగ్లీ స్వయంగా ఈ వ్యవహారంలో ఉందనడంలో అనుమానం లేదు. మోసం చేయడంతో పాటు బాధితుల పక్షాన మాట్లాడితే కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. న్యాయం జరిగేంత వరకు పోరాడుతా.

14లక్షలు పెట్టుబడి పెట్టా

మధు చిన్నప్పటి నుంచి తెలుసు. నాకు మాయమాటలు చెప్పిన మంగ్లీ పరిచయస్తుడు అమీర్ పటేల్ ద్వారా బిజినెస్‌లో సొమ్ము ఇచ్చిన. రూ.14లక్షలు వరకు పెట్టుబడి పెట్టాను. అప్పు వేధింపులు ఎక్కువయ్యాయి. ఇక నాకు ఆత్మహత్యే శరణ్యం.

రాష్ట్రంలో పలుచోట్ల ఇంధన కొరత

• బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు

టి మీడియా, ఏప్రిల్ 25 , అమరావతి :

రాష్ట్రంలో ఇంధన కొరత తలెత్తింది. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావాన్ని బూచిగా చూపి చమురు సంస్థలు కొద్దిరోజులుగా సరఫరాను తగ్గించాయి. ఆ ప్రభావం ఇప్పుడు క్షేత్రస్థాయిలో కనిపిస్తోంది. చమురు కంపెనీల నుంచి సరిపడా ట్యాంకర్లు రాక, పెట్రోల్ బంకు యజమానులు ఆందోళన చెందుతున్నారు. ధరలు పెరుగుతాయనే కారణంతో కొన్నిచోట్ల నో స్టాక్ బోర్డులు పెట్టారు. ఇంధన కొరత వ్యవసాయ, రవాణా రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పశ్చిమాసియాలో యుద్ధంతో నిన్న మొన్నటి వరకు గ్యాస్ కొరతకే పరిమితమైన ప్రభావం ఇప్పుడు ఇంధన రంగాన్నీ తాకింది. పెట్రోల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నా డీజిల్ కొరత వేధిస్తోంది. వాహనదారుల నుంచి వరి, ఆక్వా రైతుల వరకు డీజిల్ కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఈ సమయంలో డీజిల్ దొరక్క రైతులు ఇబ్బందిపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని బంకుల్లో స్టాక్ లేక కోత యంత్రాలు షెడ్లకే పరిమితమయ్యాయి. ఆక్వా రంగాన్ని ఇంధన కొరత దెబ్బతీస్తోంది. రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కోసం ఏరియేటర్లు తిరుగుతుంటాయి. కరెంటు లేని సమయంలో డీజిల్ జనరేటర్లే వీటికి ఆధారం. డీజిల్ దొరక్క రొయ్యల పంటలు దెబ్బతింటున్నాయని రైతులు తలలు పట్టుకుంటున్నారు. బస్సులు, లారీలు, ట్రక్కులు, ఆటోలు కార్ల యజమానులు డీజిల్ కొరతతో ఇబ్బందిపడుతున్నారు. సరఫరా లేదంటూ కొన్ని బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టారు. వారం రోజులుగా తిరుగుతున్నా డీజిల్ దొరకడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

డీజిల్ దొరకక రైతులు విలవిల

మరోవైపు శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఇంధన నిల్వలు అడుగంటిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రబీ సీజన్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో డీజిల్ దొరకక రైతులు విలవిలలాడుతున్నారు. ఆక్వా రంగం కూడా కష్టాలను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఏలూరులో డీజిల్ కొరతతో వరి కోతలు నిలిచిపోయాయి. అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. విజయనగరం, పార్వతీపురం బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలులో గత కొద్ది రోజులుగా ఇంధనం దొరక్క వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. పత్తికొండలో బంకులు మూతపడ్డాయి. నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరులోని కొన్ని పెట్రోల్ బంకుల్లో క్యూలో నిలబడినా దొరకని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం, చమురు సంస్థలు తక్షణమే స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు.

బంకుల వద్ద వాహనదారులు వద్ద క్యూ

ఎన్నికలు ముగిశాక దేశవ్యాప్తంగా అన్ని చోట్లా ఇంధర ధరలు పెరుగుతాయంటూ వస్తున్న వదంతులతో ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఇంధనం కోసం వాహనదారులు బంకుల వద్దకు క్యూకట్టారు. హెచ్ పి , ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ బంకుల్లో డీజిల్ దొరకడం లేదు. తెలంగాణ రాష్ట్రంలోని వల్లభి, కోదాడ, మధిర ప్రాంతాలకు వెళ్లి వాహనదారులు డీజిల్ వాహనాలు పోసుకొస్తున్నారు. కొన్నిచోట్ల డీజిల్ దొరక్క ప్రయాణాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొంత మంది బంకు యజమానులు డీజిల్ ఉంచుకుని లేదని చెప్పి బ్లాక్ చేస్తున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడికక్కడ నిలిచిపోయిన భారీ వాహనాలు

అనంతపురం జిల్లా తాడిపత్రిలో పెట్రోల్, డీజిల్ కొరతతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని పలు బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. డీజిల్ లేక ఆటోలు, భారీ వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కొన్ని బంకుల్లో అరకొరగా పెట్రోల్ సరఫరా చేస్తున్నారు. దీంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంధన కొరతతో నిత్యావసరాల రవాణాకూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి తక్షణం డీజిల్, పెట్రోల్ అందుబాటులోకి తేవాలని వాహనదారులు, ఆటో డ్రైవర్లు కోరుతున్నారు. పశ్చిమాసియా యుద్ధప్రభావంతో కేంద్రపాలిత ప్రాంతం యానాంలో పెట్రోల్, డీజిల్ కొరతతో ఏర్పడింది. వారం రోజులుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో కన్నా యానాంలో పెట్రోల్, డీజిల్ ధరలపై లీటరుకు 10 రూపాయలు ధర తక్కువ ఉండడంతో భారీ వాహనాలు, కార్లు ఆటో డ్రైవర్లు యానాంలోని పెట్రోల్ బంకులపై ఆధారపడుతుంటారు.

వరి కోతలు మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి

ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో కోత యంత్రాలకు అవసరమైన డీజిల్ అందుబాటులో లేకపోవడంతో వరి కోతలను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఏర్పడింది. ఆటోలు కూడా పక్కన పెట్టేశారు. యానాంకు సరఫరా అవుతున్న ఒకటి రెండు ట్యాంకర్లు డీజిల్ కోసం రైతులు పెట్రోల్ బంకులు వద్ద పడికాపులు కాస్తున్నారు. ఆయిల్ కంపెనీలు అనుసరిస్తున్న కొత్త విధానాలే ఈ సంక్షోభానికి కారణమని డీలర్లు అంటున్నారు. గతంలో ఒక్కో బంకుకు పూర్తి ట్యాంకర్‌ను నింపే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇప్పుడు 4 వేల లీటర్ల ట్యాంకర్‌ను 4 బంకులకు సర్దుబాటు చేస్తోందని చెబుతున్నారు. సరఫరా సంస్థలు నిల్వలు లేవని చెప్తున్నాయని ఆ ఒత్తిడి తమపై పడుతోందని, వాహనదారులకు డీజిల్ అందించలేకపోతున్నామని డీలర్లు వాపోతున్నారు.

కార్యక్రమాలలో పాల్గొన్న డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి

టీ మీడియా, ఏప్రిల్ 24, వనపర్తి బ్యూరో :

తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులుడాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి శనివారం పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. వనపర్తి జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి రాగివేణు ఇటీవలే కాలంలో అనారోగ్యంతో మరణించారు. మరణించిన సమయంలో అందుబాటులో లేక పోవడంతో శనివారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాగి వేణు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వనపర్తి మండలం చిట్యాల గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్ స్వామి కుమారుని వివాహానికి హాజరై పెళ్లి కుమారునికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా వనపర్తి జిల్లా కాంగ్రెస్ ఏఐపిసి అధ్యక్షులు నాగార్జున మేనత్త పుష్పలత అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి పుష్పలత పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వాళ్లు వనపర్తి జిల్లా కాంగ్రెస్ మాజీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, వనపర్తి జిల్లా ఏఐపిసి అధ్యక్షులు నాగార్జున,వనపర్తి మండల్ ఎన్ఎస్యుఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

• అధ్యక్షులు పిలుమల్ల గట్టయ్య

టీ మీడియా, ఏప్రిల్ 25, రామకృష్ణాపూర్;

క్యాతనపల్లి మున్సిపాలిటి రామకృష్ణాపూర్ లో శనివారం ప్రెస్ క్లబ్ క్యాతనపల్లి నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా పిలుమల్ల గట్టయ్య (మెట్రో ఈవినింగ్),ప్రధాన కార్యదర్శిగా మారపల్లి వేణుగోపాల్ రెడ్డి (ఆంధ్రప్రభ),కోశాధికారిగా అరెల్లి గోపికృష్ణ (మన సమాజం) లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ముఖ్య సలహాదారులుగా ఈదునూరి సారంగరావు (జనం సాక్షి),గౌరవాధ్యక్షులు ఆరంధ స్వామి (సిటీ కేబుల్),వెంగలదాస్ సంతోష్ (మనం),తాండ్ర సతీష్ (ఆంధ్రజ్యోతి),వర్కింగ్ ప్రెసిడెంట్ కలువల శ్రీనివాస్(జర్నలిస్ట్), ఉపాధ్యక్షులు గంగారపు గౌతమ్ కుమార్ (ప్రజా పక్షం),పిడి రాజేంద్ర ప్రసాద్ (తెలంగాణ గళం),కొండ శ్రీనివాస్ (మన తెలంగాణ),బండ అమర్నాథ్ రెడ్డి (వుదయం), పురుషోత్తం గంగులు (ప్రజా దర్బార్),ప్రచార కార్యదర్శిగా నాంపల్లి గట్టయ్య (నేటిదాత్రి), సహాయ కార్యదర్శులుగా నెల్లూరి శ్రీనాథ్ (సూర్య),నాసబత్తుల ప్రవీణ్ (నవ తెలంగాణ),దాసరి స్వామి (ప్రత్యక్ష సాక్షి),ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మోర రవీందర్ (టీ మీడియా),కొమ్ము సదానందం(విజయ భారతీ), దుర్గం వెంకటస్వామి(టుడేస్ న్యూస్),లు ఎన్నికయ్యారు. నూతన కమిటీని సభ్యులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు,ఇళ్ల స్థలాలు,ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మిస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు.జర్నలిస్టులకు అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు,సింగరేణి, ప్రభుత్వ అధికారులు సహకరించాలని కోరారు.ప్రెస్ క్లబ్ క్యాతనపల్లిని ఆదర్శ ప్రెస్ క్లబ్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

తెలంగాణలోని ప్రతీ ఇంటిని లెక్కిస్తాం

భారతి హోళికెరి

టి మీడియా, ఏప్రిల్ 25 , హైదరాబాద్ బ్యూరో :

తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటినీ లెక్కిస్తామని జనగణన రాష్ట్ర డైరెక్టర్ భారతీ హోళికేరి తెలిపారు. జనాభా లెక్కల సేకరణ వివరాలను ఆమె మీడియా సమావేశంలో వివరించారు. ఆస్పత్రి, బడి, గుడి, గుడిసె, అద్దె భవనం ఇలా ఏదైనా జనగణన జరుగుతుందని తెలిపారు.

రెండోదశలో వ్యక్తిగత సమాచారం సేకరిస్తాం

భవనంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామన్న భారతీ హోళికేరి 2027 సంవత్సరం ఫిబ్రవరిలో రెండో దశ మొదలయ్యేలోగా అంతా సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. రెండో దశలో 2027 సంవత్సరం ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచారం సేకరిస్తామని అన్నారు. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తామని, వచ్చే నెల 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కు చేస్తారని, ప్రతి భవనంలో ఎన్ని ఇళ్లు ఉన్నాయనేది మార్కు చేస్తారని పేర్కొన్నారు.

నివాసాల మార్కింగ్ పూర్తి అవుతుంది

రేపటి నుంచి మే 10 వరకు తెలంగాణలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఉంటుందన్న భారతి హోళికేరి సెల్ఫ్ ఎన్యుమరేషన్ కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఒవ.ఎవఅంబం.న్రశీజ.అఅ పోర్టల్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్‌కు వీలు కల్పించామని, 15 రోజులపాటు సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. మొదటిసారి డిజిటల్ రూపంలో జనాభా లెక్కల సేకరణ చేస్తున్నామని, ప్రజలు స్వతహాగా వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ 16 భాషల్లో అందుబాటులో ఉంటుందని, సమాచార భద్రతపై ఎలాంటి భయాందోళన చెందవద్దని సూచించారు. జనగణనతో పాటే కులగణన ఉంటుందని, తొలివిడతలో ఇళ్లకు సంబంధించిన వివరాల నమోదు ఉంటుందని, మే 11 నుంచి జూన్ 19 వరకు నివాసాలపై మార్కింగ్ చేస్తామని, మూడు, నాలుగు రోజుల్లో నివాసాల మార్కింగ్ పూర్తి అవుతుందని వివరించారు.

ఎక్కడ ఉన్నా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చు

తొలి విడత గణన, స్వీయ ధ్రువీకరణ వివరాలు వెల్లడించిన భారతి హోళికేరి సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో 33 ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ తర్వాత రెండో దశలో ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికీ వస్తారని అన్నారు. 33 ప్రశ్నల్లో 27 ప్రశ్నలకే ప్రజలు జవాబు ఇవ్వాల్సి ఉంటుందని, భారతి హోళికేరి మిగతా 6 ప్రశ్నలకు ఎన్యుమరేటర్ ఇంటికి వస్తే వివరాలు చెప్పాలని సూచించారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ తప్పనిసరి కాదని, ఆప్షన్ మాత్రమేనని అన్నారు. దేశంలో ఎక్కడ ఉన్నా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

తొలి విడత ఇళ్ల గణన ఉంటుంది

జనగణన కోసం 1855 నంబర్‌తో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని, ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు హెల్ప్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. తొలి విడతలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా జనాభా లెక్కల సేకరణ చేస్తామని, జీహెచ్ఎంసీ కోర్ అర్బన్ పరిధిలోని వార్డుల్లో వివరాల సేకరణ చేస్తామని, జీహెచ్ఎంసీలోని 61 సర్కిళ్లలో ఛార్జ్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. వచ్చే నెల 11 నుంచి జూన్ 19 వరకు తొలి విడత ఇళ్ల గణన ఉంటుందని వివరించారు.

ఫ్రెండ్‌ను చంపిన కొడుకు

• పోలీసులకు పట్టించిన తల్లి

టి మీడియా, ఏప్రిల్ 25 , భువనగిరి:

యాదాద్రి భువనగిరి జిల్లా మేడిపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మేడిపల్లి గ్రామానికి చెందిన రాగీరు మధు(25), గాంధారి చరణ్, ఊట్ల నవీన్ ముగ్గురు స్నేహితులు. వీరు ముగ్గురు మద్యానికి బానిసలుగా మారారు. వీరిలో చరణ్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. నవీన్ ఆటో నడుపుతున్నాడు. మధు మాత్రం ఏ పనిచేయట్లేదు. ఇదిలా ఉంటే శుక్రవారం ఉదయం మద్యం మత్తులో ఇంటికి వెళ్లిన చరణ్.. మధును హత్య చేసినట్లు తన తల్లితో చెప్పాడు. చంపేసిన తర్వాత చెరువు సమీపంలోని ఇసుక దిబ్బలో ఉన్న గడ్డిలో పాతి పెట్టానని తెలిపారు. ఈ విషయం తెలియగానే ఆ తల్లి.. కొడుకును కాపాడుకోవాలని చూడలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. చరణ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా జరిగిన విషయాన్ని బయటపెట్టాడు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల వెనుక మధు, నవీన్‌తో కలిసి తాగానని చెప్పాడు. ఆ సమయంలో లక్కీ డ్రాప్ కోసం మధు తమతో వాగ్వాదానికి దిగాడని తెలిపాడు. ఆ కోపంలో రాడ్‌తో కొట్టడం మధు అక్కడికక్కడే మరణించాడని పేర్కొన్నాడు. ఈ విషయం బయటపడకూడదని ఉదయం 4 గంటల సమయంలో శామీర్‌పేట వాగు వద్దకు తీసుకెళ్లి అక్కడే ఉన్న ఇసుక దిబ్బలో మధు మృతదేహాన్ని పాతిపెట్టినట్లుగా వివరించాడు.

మరోవైపు మధుకు రెండు మూడు రోజులైనా ఇంటికి వెళ్లకుండా బయటకు తిరగడం అలవాటు. దీంతో కొడుకు రాకపోయినప్పటికీ అతని తల్లిదండ్రులు వెతకలేదు. కానీ తన కొడుకు చనిపోయాడని పోలీసులు తెలపడంతో విషయం తెలిసి.. శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా, పరారీలో ఉన్న మరో నిందితుడు నవీన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

విజయవాడలో గంజాయి విక్రయం

• ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు

టి మీడియా, ఏప్రిల్ 25 , విజయవాడ :

విజయవాడ నగరంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసుల కఠినంగా వ్యవహరిస్తున్నారు. అజిత్ సింగ్ నగర్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో యోగానంద సునీత, చేబ్రోలు నవీన్, బాల ప్రశాంత్ కుమార్, తాడేపల్లి నాగబాబు, భూదల విజయ్, పరిటాల జోజి బాబు, దాసరి వంశీ, మిండల రత్నకుమార్ ఉన్నారు. వీరితో పాటు మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

7 కిలోల గంజాయి స్వాధీనం

విజయవాడ తోట వారి వీధి పరిసరాల్లో రహస్యంగా గంజాయి విక్రయిస్తున్నట్లు అజిత్ సింగ్ నగర్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మాదకద్రవ్యాల ముఠా నగరంలో గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. అజిత్ సింగ్ నగర్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నగరంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టేందుకు పోలీసు శాఖ పూర్తి శ్రద్ధతో పని చేస్తోందన్నారు.

ఇతర నగరాల్లో కూడా ఇదే విధంగా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాన్ని అరికట్టేందుకు పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కొంతమంది గ్యాంగ్?గా ఏర్పడి ప్రత్యేకంగా గంజాయి, హెరాయిన్, ఇతర మాదకద్రవ్యాలను సరఫరా చేయడంతో పాటు విక్రయిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ముఖ్యంగా విజయవాడ వంటి నగరాల్లోనే కాకుండా రాష్ట్రంలోని కొన్ని గ్రామీణ ప్రాంతాలు, పట్టణ పరిధుల్లో ఈ రకమైన అక్రమ కార్యకలాపాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ ముఠాలు గంజాయి ఇతర మాదకద్రవ్యాలను రహస్య మార్గాల్లో రవాణా చేసి యువతలో మత్తులు ముంచేందుకు ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా కొంతమంది వ్యక్తులు, వ్యాపారులు, రవాణాదారులు ఈ అక్రమ కార్యకలాపాల్లో భాగమైనట్లు పోలీసులు గుర్తించారు.

కేసీఆర్ మారినందుకే...

నేను యుద్ధం చేస్తున్నా

• ముందుంది ముసళ్ల పండగ : కవిత

టి మీడియా, ఏప్రిల్ 25 , మేడ్చల్ :

మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కల్వకుంట్ల కవిత ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్?)'గా నామకరణం చేశారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి పిడికిలి బిగించి కొట్లాడామన్నారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో హిట్లర్ పాలన సాగిస్తున్నారని కవిత మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కలిసి రాష్ట్రప్రజలను దోచుకుంటున్నారన్న కవిత తెలంగాణ ప్రజల కోసం పాంచజన్యాలను ప్రకటించారు. బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చిందని వెల్లడించారు.

కేసీఆర్ మారినందునే యుద్ధం చేస్తున్నా

కేసీఆర్‌కు అధికారం ముందు మమకారం తగ్గిపోయిందా? అని కవిత ప్రశ్నించారు. కేసీఆర్ రాజకీయ పరిణతి కోల్పోయి మాట్లాడుతున్నారని, కేటీఆర్‌కు ఏమీ తెలియనందున ఆయన మాట్లాడినా పట్టించుకోరని, ప్రజలు తప్పు చేశారని కేసీఆర్ చెబుతున్నారని, ప్రజలు తప్పు చేసి మీకు అధికారం ఇవ్వకపోతే వదిలేస్తారా? అని నిలదీశారు. రాష్ట్రంలో కర్కోటకుడి పాలన నడుస్తోందని, ప్రజలు గోస పడుతున్నారని ఆరోపించారు. హైడ్రా పేరుతో ఇళ్లు కూల్చుతుంటే ఆదుకోవాల్సిన కేసీఆర్ ఎక్కడున్నారని నిలదీశారు. తనను పార్టీలో నుంచి బయటకు పంపితే వెంటనే పార్టీ పెట్టలేదని, మారతారేమోనని వేచి చూశానని, పది నెలలైనా మారలేదని అన్నారు. తనకు నిజంగా బాగానే జరిగిందని, ఆనాడు ఉద్యమకారులను ఇబ్బంది పెడుతుంటే ఇంకా గట్టిగా మాట్లాడాల్సిందని తెలిపారు. ఆనాడు మీకు జరిగిందే, ఇవాళ తనకు జరిగిందని ఉద్యమకారులను ఉద్దేశించి అన్నారు. కండువా వేసుకుని తిరిగిన ఉద్యమకారులకు సరైన గుర్తింపు రాలేదని, అధికారం వచ్చిన తర్వాత అమ్మతనం, మమకారం పోయిందని విమర్శించారు. కేసీఆర్ మారినందునే తాను నిలబడి యుద్ధం చేస్తున్నానని వెల్లడించారు. తెలంగాణ గడ్డకు ప్రాణాలు అడ్డుపెట్టి ప్రజలను కాపాడే వ్యక్తులు కావాలని, తెలంగాణ ప్రజలను కాపాడే సైన్యంగా మారేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఉద్యమ సమయంలో మాదిరిగా ఇప్పుడూ పని చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఒక్క పాలమూరు-రంగారెడ్డి మాత్రమే కాదు కాళేశ్వరంలో అవినీతి జరిగిందని, తన బిడ్డ, కుమారుడు తప్పు చేస్తే పార్టీ నుంచి తొలగిస్తానని నాడు కేసీఆర్ చెప్పారని, తాను ఏ తప్పు చేశానని ప్రశ్నించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని చెప్పానని, అందుకు తనను బయటకు పంపారని తెలిపారు. అవినీతి చేసిన పందికొక్కులను పక్కన కూర్చోపెట్టుకున్నారని, ఆత్మ లేని మరబొమ్మలా కేసీఆర్ మారారని, అందుకే పోరాడుతున్నానని పేర్కొన్నారు. తనతో కలిసి పోరాడేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అనేక తప్పులు చేస్తోందని విమర్శించారు.

కర్కోటక సీఎం పాలనలో ఉన్నాం

ఇప్పుడే ఇల్లు అలికామని, ముందుంది మొసళ్ల పండుగ అని కవిత పేర్కొన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో అన్ని పత్రాలు ఉన్నా అర్ధరాత్రి ఇల్లు కూల్చారని, నిండు గర్భిణీకి అబార్షన్ జరిగితే ఆమె తండ్రి రోదన తన చెవిలో మార్మోగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఇప్పుడున్న సీఎంను కర్కోటకుడని, హిట్లర్ అనే అంటానని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కర్కోటక సీఎం పాలనలో ఉన్నామని, కచ్చితంగా కొట్లాడాల్సిందేనని, పిడికిలి బిగించి రాక్షస కాంగ్రెస్‌పై అందరి కంటే ఎక్కువ కొట్లాడతామని స్పష్టం చేశారు.

పిడికిలి బిగించి కొట్లాడాం

తన జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుందని కల్వకుంట్ల కవిత తెలిపారు, తెలంగాణ భవిష్యత్తు రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి పిడికిలి బిగించి కొట్లాడామని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జాగృతి కీలకపాత్ర పోషించిందని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆడబిడ్డలందరూ భాగస్వామ్యం అయ్యారని, జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని, కాలరాత్రిలో కాగడాలా తెలంగాణ ఉద్యమకారులకు వెలుగునిచ్చిందని తెలిపారు. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారిందని, మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నామని అన్నారు. జాగృతి కార్యకర్తలు ఉద్యమానికి బలమైన సాంస్కృతిక పునాది ఇచ్చారని, ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదని విమర్శించారు.

తెలంగాణ ప్రజలకు క్షమాపణలు

కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పిందని, తెలంగాణ ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయిందని, సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైందని , కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదని విమర్శించారు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించామని, రైతులకు బేడీలు పడ్డాయని, ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్లు ఎక్కడ పర్యవేక్షిస్తున్నారోనని భయం, వ్యక్తిగత స్వేచ్ఛ లేదని తెలిపారు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికిందని, మనం అనుకున్న తెలంగాణ రాలేదనేది ముమ్మాటికీ వాస్తవమని, ఆనాడు పరిపాలించిన కుటుంబంలో తాను కూడా ఒక భాగమని గుర్తు చేశారు. తాను కూడా భాగమైనందుకు కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నానని అన్నారు. తెలంగాణ ప్రజలను క్షమాపణలు కోరుతున్నానని అన్నారు.

బీఆర్ఎస్ ఆత్మను కోల్పోయింది

తెలంగాణ సాధించినందుకు గర్వపడుతున్నానని, జన్మధన్యమైందని భావిస్తున్నానని, తప్పులో తనకు భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదని అన్నారు. సామాజిక న్యాయ తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పనిచేయాలని తెలిపారు. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన ప్రజల ముందుకు వచ్చిందని, తమ పని తీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారని అన్నారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదని, రాజకీయ అధికారం ఉండాలని తెలిపారు. రాజకీయ అధికారం తోడైతేనే ప్రజలకు మంచి చేయగలమని, ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలని, బీఆర్ఎస్ సాంకేతికంగా ఉన్నా ఆత్మను కోల్పోయిందని, బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చిందని వెల్లడించారు.

బీజేపీ ఎంపీలకు కవిత సవాల్

తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్నానని, అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డలకు కష్టం వస్తే తీరుస్తుందని కవిత అన్నారు. తెలంగాణలో ఏళ్ల తరబడి భూస్వామ్య వ్యవస్థ నడిచిందని తెలిపారు. ఎందరో మహనీయులు పోరాడితే కొంత సమానత్వం వచ్చిందని, మలిదశ ఉద్యమంలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే తెలంగాణ వచ్చిందని కొనియాడారు. రాజకీయ శక్తితో పోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తామని అన్నారు, బీజేపీకి తెలంగాణ ఏర్పాటే ఇష్టం లేదని, తల్లిని చంపారని, పిల్లను బతికించారని ఒకరు అన్నారని విమర్శించారు. భారత్, పాక్‌ను విడదీసినట్లు తెలుగు రాష్ట్రాలను విభజించారని మరో ఎంపీ చెప్పారని, బీజేపీ బానిస ఎంపీలు ఒక్క మాట మాట్లాడరని ఎద్దేవా చేశారు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడరని, విభజన హామీలు నెరవేర్చకపోతే బీజేపీ ఎంపీలు మాట్లాడరని, సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి భారతీయ జనతా పార్టీ అని విమర్శించారు. మహిళా బిల్లును పక్కనపెట్టారని, బీసీ బిల్లును తొక్కి పెట్టారని అన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు కవిత సవాల్ విసిరారు. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలని ఛాలెంజ్ చేశారు. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుందని, గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశామని అన్నారు.